క్లుప్తంగా

రేపు ఉద్యోగ మేళా

మన్ననూర్: స్థానిక ఆర్‌ఐటీఐ కళాశాలలో ఈ నెల 7వ తేదీ శనివారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్, హైదరాబాద్‌లలోని క్యూస్ కార్పొరేషన్, వరుణ్ మోటార్స్ కంపెనీలలో 200 వరకు వివిధ కేటగిరీలలో ఉద్యోగాలను భర్తీ చేస్తారని పేర్కొన్నారు. పది, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ చదివి 18–35 ఏళ్ల లోపు వయస్సు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులని తెలిపారు. నెలకు రూ.12,000 నుంచి రూ.15,000 వరకు జీతం ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలకు ఐటీఐ కళాశాల సిబ్బంది సెల్: 9951707945, 9603012267 నంబర్లను సంప్రదించాలని ఆమె సూచించారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

కల్వకుర్తిరూరల్: మార్కెట్‌లో కూరగాయలు విక్రయించేందుకు వచ్చే రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని మార్కెట్ డైరెక్టర్ గంగాధర్ కూరగాయల కమీషన్ ఏజెంట్లకు సూచించారు. గురువారం ఆయన కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్లకు చెందిన కొంతమంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మైనారిటీ నాయకులు గురువారం మండలంలోని వెల్టూరు స్టేజీ సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, విజేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక

వెల్దండ: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలలో భాగంగా గురువారం శరన్నవరాత్రి ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జూలూరి సైదులు, ప్రధాన కార్యదర్శి సంతోష్, పూరి అనిల్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. ఈనెల 15వ తేదీ నుంచి 25 వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘం నాయకులు వజ్రలింగం, రాజయ్య, ఆంజనేయులు, రమేష్, కుమారస్వామి, కృష్ణ తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులపై అవగాహన కల్పించాలి



తాడూరు: ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించాలని డీఆర్‌డీఓ నర్సింగరావు అన్నారు. గురువారం మండలంలోని గోవిందాయిపల్లి, ఎట్టిదార్‌పల్లి, అంతారం గ్రామాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఏర్పాటు చేసే నర్సరీలకు సంబంధించి మట్టిని నింపేందుకు కవర్లలను గ్రామ పంచాయితీల వారీగా అందజేశామన్నారు. ప్రతి గ్రామంలో 50 మందికి తక్కువ కాకుండా ఉపాధి పనులను చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ గంగామోహన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

సబ్‌స్టేషన్‌కు మోక్షమెప్పుడో?

- ఏళ్లుగా రైతులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



పోతేపల్లిలో అసంపూర్తిగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

వెల్దండ: మండలంలోని పోతేపల్లిలో లోఓల్టేజీ సమస్య తీర్చేందుకు ప్రభుత్వం 2018 సంవత్సరంలో నూతనంగా 33.11 కెవీఏ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మాణానికి అప్పట్లో రూ.1.20కోట్ల నిధులను మంజూరు చేసింది. సబ్‌స్టేషన్ నిర్మాణానికి కాంట్రాక్టర్లు పనులు దక్కించుకొని పనులను ప్రారంభించారు. కొంత వరకు పనులను ప్రారంభం చేసిన కాంట్రాక్టర్లు అర్ధాంతరంగా పనులను నిలిపివేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు, సబ్‌కాంట్రాక్టర్‌కు ఇద్దరి మధ్య బిల్లుల సమస్యలు వచ్చి పనులు మధ్యలో నిలిపివేయడంతో సమస్య మొదటికి వచ్చింది. పోతేపల్లి, లింగారెడ్డిపల్లి, దొడ్లపల్లి, ఎంజీతండా, అల్లంతోటబావితండా, సిలోనిబావితండా, పోషమ్మతండా తదితర గ్రామాల రైతులు విద్యుత్ కష్టాలు తీరిపోతాయని భావించారు. కాని రైతుల ఆశ మున్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. పనులు నిలిచి మూడేళ్లు గడిచిన నేటికి పూర్తి కాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లినా కాంట్రాక్టర్ నేటికి పనులను ప్రారంభించలేదని గ్రామస్తులు ఆరోపించారు.

లోవోల్టేజీ సమస్య..

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా డీ–82 కాల్వ ద్వారా సాగు నీరు వస్తోంది. దీంతో పంటలను రైతులు సాగు చేశారు. విద్యుత్ వినియోగం అధికం కావడంతో తరుచుగా లోవోల్టేజీతో వ్యవసాయ మోటర్లు మరమ్మతులకు గురవుతున్నాయని రైతులు వాపోయారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

లోవోల్టేజీ సమస్య ఉంది



గ్రామంలో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో వ్యవసాయ బోరు మోటర్లు తరుచుగా మరమ్మత్తులకు నోచుకుంటున్నాయి. సాగుచేసిన పంటలు చేతికందే సమయంలో ఎండిపోతున్నాయి. లోవోల్టేజీతో పంటలను కాపాడుకోలేకపోతున్నాం. నూతన సబ్ స్టేషన్ మంజూరు చేసిన ఉపయోగం లేదు. ఉన్నత అధికారులు స్పందించి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి.

– సైదయ్య, రైతు, పోతేపల్లి

త్వరలోనే పూర్తి చేస్తాం..



అసంపూర్తిగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను త్వరలోనే పూర్తిచేయిస్తాం. సంబంధిత కాంట్రాక్టర్లను సంప్రదించి పనులను వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. రైతులకు లోవోల్టేజీ సమస్య ఉన్నది వాస్తవమే. కేఎల్ఐ కాల్వ ద్వారా సాగునీరు రావడంతో విద్యుత్ మోటర్ల వాడకం అధికంగా ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.

– సూర్యం, విద్యుత్ ఏఈ, వెల్దండ

అధికారులపై ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ

బల్మూర్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ వేనేపల్లి అరుణ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభలో ఏకరవు పెట్టారు. విద్యుత్, ఈజీఎస్, మత్స్యశాఖ, పంచాయతీరాజ్‌శాఖల అధికారుల తీరుపై గట్టుతుమ్మెన్, తుమ్మెన్‌పేట, జిన్‌కుంట, మహదేవ్‌పూర్ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గట్టుతుమ్మెన్–జిన్‌కుంట విద్యుత్ లైన్‌కు స్తంభాలు వేసి ఎవరి చెప్పకుండానే తొలగించారని సర్పంచ్ నాగరాజ్ మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సమావేశంలో చర్చించిన అంశాలపై కూడా చర్యలు తీసుకోకపోతే సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని బల్మూర్ సర్పంచ్ శివశంకర్ ప్రశ్నించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సభకు హాజరు కాని శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. వైస్ ఎంపీపీ నారాయణ, విండో చైర్మన్ నర్సయ్యయాదవ్, తహసీల్దార్ సలీమొద్దీన్, ఎంపీడీఓ దేవన్న, డీఈ భాషునాయక్, ఏఓ మహేష్‌కుమార్, ఎంఈఓ రామారావు, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు వాసవీక్లబ్ సేవలు



విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేస్తున్న రామకృష్ణ

కల్వకుర్తిరూరల్: సమాజంలోని అన్ని వర్గాలకు వాసవీక్లబ్‌ల ద్వారా సామాజిక సేవ కార్యక్రమాలు అందిస్తున్నామని వాసవీక్లబ్ గవర్నర్ రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని పంజుగూలలో పాఠశాల విద్యార్థులకు నోటుబుక్స్, టై, బెల్టులు పంపిణీ చేశారు. అదేవిధంగా దేవాలయంలో బెంచీలను అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి మధుమోహన్, రీజియన్ చైర్మన్ రమేష్, సెక్రెటరీ సత్యనారాయణ, జోన్ చైర్మన్ విజయ్‌కుమార్, క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి అశోక్, శ్రీలక్ష్మి, లక్ష్మి, ధనలక్ష్మి, కృష్ణ, ఎల్లగౌడ్, గణేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

తాడూరు: ఆశావర్కర్ల నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆశావర్కర్లతో కలిసి బీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు భరత్ వినతిపత్రం అందజేశారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పుష్ప, రామచంద్రమ్మ, సుమతి, జ్యోతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న వంట కార్మికుల సమ్మె



తాడూరు: మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమ్మె గురువారం కొనసాగింది. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న మాట్లాడుతూ కార్మికులకు రెండు జతల దుస్తులు, రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. అదేవిధంగా సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు రాజేశ్వరి, తిరుపతమ్మ, రాములమ్మ, ఈశ్వరమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

చారకొండ: మండలంలోని మర్రిపల్లి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి గురువారం ఎంపీడీఓ జయసుధ, పీఆర్ఏఈ మోనిక, సర్పంచ్ నరేష్ నాయక్ స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణానికి కావల్సిన అనువైన స్థలాన్ని గుర్తించారు. స్థలంలో మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్ నాయక్, పంచాయతీ కార్యదర్శి రవి శంకర్, నాయకులు రవీందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కొండల్ రెడ్డి గ్రామస్తులు ఉన్నారు.

గ్రామాల మాదిరి తండాలో మౌలిక వసతులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: తండాలలో గ్రామాల మాదిరి అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రజా ప్రస్థానంలో మర్రన్న యాత్రలో భాగంగా మండలంలోని ఉడుగులకుంట తండా, నక్కల చెరువు తండా, మీట్యాతండా, ఎర్రకుంట తండాలలో ఆయన పర్యటించారు. ఆయా తండాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తండాలలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నల్లమలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం



మహిళలకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అమ్రాబాద్: నల్లమల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. గురువారం పదర మండలంలోని మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో పీసీసీఎఫ్ జైస్వాల్‌తో కలిసి ఏకోటూరిజం పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అడవులు, అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ రోహిత్‌గోపిడి, జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబునాయక్, ఎంపీపీ భీక్యానాయక్, ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ విష్ణుమూర్తి, వైస్ ఎంపీపీ వరుణ్‌కుమార్, అటవీశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం అచ్చంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అందజేశారు. మండలంలో 17 మంది లబ్ధిదారులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు పర్వతాలునాయక్, రఘు, నాయకులు రవీందర్‌రావు, గోపాల్‌రెడ్డి, పరమేశ్వర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దోమలపెంట: గ్రామ పంచాయతీకి పూర్తిస్థాయిలో హక్కులు కల్పించాలని కోరుతూ గురువారం దోమలపెంట గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు అచ్చంపేటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజును కలిశారు. ఈ సందర్భంగా వారు శ్రీశైలం ఆనకట్ట నిర్మాణంలో భాగంగా ఇంజినీర్లు, సిబ్బంది కోసం నివాస గృహాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ కాలువ కాలనీ దోమలపెంట గ్రామ సంక్షేమ బాధ్యతలను శ్రీశైలం ఆనకట్ట నిర్వహణ అధికారి కార్యాలయం వారు చూసేవారు. రాష్ట్రం రెండుగా విడిపోవడంతో ఆనకట్ట సిబ్బంది దాదాపుగా అందరు రిటైర్డ్ అవడం వలన ప్రస్తుతం గ్రామ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న నల్గొండ జిల్లా, అంగడిపేటలో ఉన్న ఎస్ఎల్‌బీసీ, ఈఈ కార్యాలయం వారికి కష్టతరమయ్యిందని వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కలెక్టర్‌కు ఫోన్‌లో సమస్యను వివరించారు. గ్రామ పరిరక్షణ కమిటీ కన్వీనర్, సర్పంచ్ శారద, కమిటీ సభ్యులు ఎడ్ల శేఖర్, సుబ్బారెడ్డి, ఇబ్రహీం, ప్రసాద్, తిమ్మన్న పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత: కేసు నమోదు

వెల్దండ: మండలంలోని కొట్రలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామానికి చెందిన దశరథం ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో కొట్రలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించామని పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాత కలెక్టరేట్ ఎదుట ధర్నా



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట గురువారం 104 ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ కమిటీ నాయకులు ఫసియోద్దీన్ మాట్లాడుతూ 104 ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయిరాం, యాదగిరి, చినస్వామి, రాంచంద్రం, బాలరాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తి చేస్తాం

అచ్చంపేట రూరల్: పట్టణంలో అన్ని హంగులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పూర్తి చేస్తామని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, నీటి పారుదల శాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న వృక్షాలను తొలగింపునకు టెండర్ నిర్వహించారు. పట్టణానికి చెందిన హర్ష రూ.1.37లక్షలను కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ చెట్ల తొలగింపు అనంతరం నిర్మాణ పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమేష్‌రావు, సోమ్లానాయక్, రమేష్, కమిషనర్ శ్రీహరిరాజు, సిబ్బంది మధు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగానికి ఐదుగురు ఎంపిక

కోడేరు: ప్రభుత్వం వెల్లడించిన పోలీసు కానిస్టేబుల్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన ఐదుగురు ప్రతిభ కనబరిచారు. కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించిన యువకులను గ్రామస్తులు గురువారం సన్మానించారు. గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ శెట్టి, ఆది కొమ్ము రాజు, ఆది బొమ్మగల్ల రాము, కోడేరులో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న కావలి వట్టెల శ్రీను, ఆర్మీలో విధులు నిర్వహించి రిటైర్డు అయిన జగదీశ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. మరో యువకుడు ఉమ్మర్ లైన్‌మెన్‌గా ఉద్యోగం సాధించాడు.

హామీలను అమలు చేస్తాం



పెంట్లవెల్లి: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను తప్పకుండా అమలు చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. గురువారం ఎంగంపల్లితండాలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి బూత్ కమిటీని ఎన్నుకొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జూపల్లి కృష్ణారావు గెలుపునకు అందరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షుడు నర్సింహనాయుడు, తండా సర్పంచ్ గోపినాయక్, గోపాల్‌నాయక్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి రూ.30 వేల ఆర్థికసాయం



కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి మల్లేష్ చదువుకోసం ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి గురువారం రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. విద్యార్థి కుటుంబసభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ఎల్లయ్య, రమేష్‌గౌడ్, కిష్టారెడ్డి ఉన్నారు.

ఆడపడుచులకు అండగా ప్రభుత్వం



కల్వకుర్తిలో స్పోర్ట్స్ కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



చారకొండ మండలం తిమ్మాయిపల్లిలో



పెద్దకొత్తపల్లి మండలం మహాసముద్రంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి: ఆడపడుచులకు అండగా ప్రభుత్వం ఉందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బతుకమ్మ చీరలు, కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయం భవనం, బాచారం హైలెవల్ కెనాల్ కాల్వ నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయన్నారు. మహాసముద్రం, కల్వకోల్ గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలను అదేవిధంగా మహాసముద్రంలో వీధిలైట్లను ప్రారంభించి బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రేణుకనాగరాజు, రామచంద్రయ్య, వెంకటస్వామి, సర్పంచ్‌లు గట్టయ్య, ఉజ్వల, ఉపసర్పంచ్‌లు సుగుణమ్మ, వెంకటస్వామి, సింగిల్‌విండో అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, గణేష్‌రావు, రైతు సమన్వయసమితి మండల అధ్యక్షుడు నాగరాజు, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, ప్రేమ్‌రాజారావు, కురుమయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని వేపూరు, ముకురాల గ్రామాలలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పర్యటించారు. వేపూరు గ్రామంలో నూతన పాఠశాల భవనంతోపాటు, సీసీరోడ్లను ప్రారంభించారు. అదేవిధంగా స్పోర్ట్స్ కిట్లు, బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ముకురాలలో 12 మంది లబ్ధిదారులకు మంజూరైన గొర్రెలను పంపిణీ చేశారు. వేపూరులో సర్పంచ్ మాధవిగోవర్ధన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోహర, వైస్ ఎంపీపీప గోవర్ధన్, మార్కెట్ విజయ్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జంగయ్య, పంచాయతీరాజు డీఈ దుర్గప్రసాద్, ఎంపీడీఓ ఆంజనేయులు, పశువైద్యాధికారి శ్రీనాథ్ పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని తుర్కలపల్లి మండల కోఆప్షన్ సభ్యులు షేక్ సలీం, తిమ్మాయిపల్లిలో అధికారులతో కలిసి సర్పంచ్ బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు లక్ష్మమ్మ, మహేష్ గౌడ్, నాయకులు రవీందర్, తిరుమల్లేష్, కొండల్, కమాలాకర్ రావు,అధికారులు తదితరులు ఉన్నారు.

తాడూరు: మండల కేంద్రంలో సర్పంచ్ యాదమ్మ బతుకమ్మ చీరల పంపిణీ చేశారు. బతుకమ్మ కానుకగా ప్రభుత్వం అందజేసే చీరలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మశన్న, పర్వతాలు, కార్యదర్శి పవన్‌కుమార్, వెంకటేష్, మహేష్, లీడర్‌లు శ్రీనివాసులు, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంతోపాటు గౌరారం, గట్టురావిపాకుల తదితర గ్రామాల్లో ఎంపీపీప కొమ్ము మధు బతుకమ్మ చీరల పంపిణీ చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని మహిళా సమైక్యా భవనంలో స్పోర్ట్స్ కిట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ యాదయ్య, ఎంపీడీఓ భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు రమేష్, విజయలక్ష్మి, లక్ష్మమ్మ, సర్పంచ్‌లు జమ్ములు, లక్ష్మితోపాటు ఉపసర్పంచ్ రామ్‌రెడ్డి, కువలేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: ప్రభుత్వం దసరా పండుగ కానుకగా అందజేస్తున్న బతుకమ్మ చీరలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు సూచించారు. మండలంలోని తాడూరు, కొరటికల్, వెల్టూర్ గ్రామాల్లో బతుకమ్మ చీరల పంపిణీ చేశారు. సర్పంచ్‌లు రమేష్‌రెడ్డి, అలివేలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లి, లింగసానిపల్లిలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కల్వనకృష్ణయ్య, జంగయ్య బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఖాజా, నాయకులు కృష్ణయ్య, పరశురాములు, కురుమయ్య, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక రేషన్ దుకాణాల్లో సర్పంచ్ నేనావత్ శ్రీరాం నాయక్, ఎంపీడీఓ రామ్మోహన్, కార్యదర్శి భీముడు మహిళలకు బతుకమ్మ చీరలు అందజేశారు. డీలర్లు బక్కమ్మ, సంధ్య, సెహనాజ్, సత్యనారాయణ, బాలస్వామి పాల్గొన్నారు.



తాడూరులో



తెలకపల్లిలో..



తాడూరులో..



మన్ననూర్‌లో..

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం

కొల్లాపూర్: మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్ఎం గార్డెన్‌లో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన 406 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ నాగరాజు, తహసీల్దార్ శ్రీకాంత్, మార్కెట్ చైర్మన్ కిషన్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం..

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరులో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సర్పంచ్ బండి లక్ష్మీదేవమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు ఈజీఎస్ నిధులు మంజూరు చేశామన్నారు. అంతకు ముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మంజుల, గొర్ల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాలియాదవ్, బండి రాముడు, శేఖర్ శెట్టి, వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం..

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేసినందుకు కేసీఆర్ చిత్రపటానికి కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్ రెడ్డి గ్రామ యువకులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రేణుకానాగరాజు, సింగింల్‌విండో అధ్యక్షుడు రాజేంద్రగౌడ్, ఉపసర్పంచ్ మశన్న, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నాగరాజు, వెంకటయ్య, వెంకటేశ్వర్‌రావు, అజయ్‌కుమార్, నర్సింహ, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.